# నమ్మని నిజం

డాక్టర్ శివరామ్ ఒక రోగిని పరీక్షిస్తున్నాడు. ఇంకాకొందరు వరుసక్రమంలో ఒక ప్రక్కన నుంచుని వున్నారు.

అప్పుడే రాఘవులు ఆత్రంగా లోపలికి వచ్చాడు.

"నమస్కారం డాక్టరుగారూ: తొందరగా తమరు దయ చెయ్యాలి. ఎవరో గర్భిణీస్త్రీ, మార్గమధ్యంలో తెలివితప్పి పడివుంది..." అన్నాడు వగర్చుకుంటూ.

"ఎక్కడ?" తలయెత్తకుండానే, చీటీరాస్తూ అన్నాడు డాక్టరు శివరామ్.

"దగ్గర్లోనే డాక్టరుగారూ: తమరు వేగిరం బైలు దేరాలి..."

డాక్టరుకి బైలుదేరక తప్పిందికాదు. విసుగ్గాలేచి, మెడిసిన్ బేగ్ రాఘవులకి అందిస్తూ బైలుదేరాడు.

అక్కడున్న రోగులంతా కళ్లప్పగించి చూడ్డం తప్పించి యింకేమీ చేయలేక పోయారు.

రాఘవులు, డాక్టరూ వెళ్ళేసరికి ఆస్త్రీ పడివున్న చోట లేదు. కాని, రాఘవులుతల్లి తమ యింటిముందు నుంచుని కేక వేసింది.

"రండి డాక్టరుగారూ" అంటూ తీసుకుపోయాడు.

"నువ్వు వెళ్ళాక ఆవిడకి స్పృహ వచ్చిందిరా అబ్బాయ్. ఇంట్లోకి తీసుకువచ్చాం. నెలలు నిండాయి గామోసు, నొప్పులు పడుతోంది. మంత్రసాని మంగమ్మకు కబురు పంపితే వచ్చింది. మరో గంటలోగా ప్రసవం రావచ్చునన్నది" అంది రాఘవులు తల్లి తులశమ్మ.

"క్షమించండి డాక్టరుగారూ! మిమ్మల్ని అనవసరంగా, ఆత్రుతకొద్దీ పిల్చాను. మరేమీ అనుకోకండి. అవసరమైతే మళ్ళీవస్తా" అంటూ క్షమాపణ చెప్పుకున్నాడు రాఘవులు.

డాక్టర్ శివరామ్‌కి చెప్పలేనంత కోపం వచ్చింది. అయినా ఏం చేస్తాడు? తిరుగుముఖం పట్టాడు విసుగుతూ.

రాఘవులు పనిలోకి వెళ్లడం మానుకున్నాడు ఆరోజు. వరండాలో కుక్కిమంచంమీద కూచున్నాడు. అతని మెదడు ఆలోచన ప్రారంభించింది. ఆమె ఎవరు? యెక్కడికి వెళ్తుంది?... ఏజన్మ బాంధవ్యమో మరి, తమ యింట్లో ప్రసవిస్తోంది. యిలా ఆలోచనలు సాగిస్తుండేసరికి 'కేర్' మంటూ పసిపాప యేడుపు వినిపించింది. రాఘవుల్లో, అదో విధమైన ఆనందం తొణికిస లాడింది.

"ఒరేయ్ ఆడపిల్లరా! ఎంచక్కా వుందనుకున్నావు? పాపం, ఆమెవారు ఎక్కడుంటారో మనకి తెలీదుకదా" అంది తులశమ్మ.

"అడిగితే బాగుండునమ్మా" అన్నాడు రాఘవులు.

"జవాబు చెప్పే స్థితిలో ఆమె లేదురా" అంటూ మళ్ళీ లోపలికి పోయింది.

రాఘవులు నిశ్చలంగా కూచున్నాడు. పసిపాప రోదన, ఆ తల్లి మూలుగులు మాత్రం మధ్య మధ్య వింటున్నాడు. ఒక గంట కాలంగడిచింది. మంత్రసాని మంగమ్మ, తన పనులు నిర్వర్తించుకొని వెళ్లిపోయింది, కొద్దిసేపు క్రింతం. రాఘవులు భార్య లక్ష్మి ఆతృతగా వచ్చింది.

"వెళ్ళి డాక్టర్ని తీసుకురండి" అంది.

విద్యుత్తుషాక్ తిన్నవాడిలా లేచి నుంచున్నాడు రాఘవులు.

"ఏమయింది మళ్ళీ?"

"వొళ్ళంతా చల్లబడింది. అది మంచిసూచన కాదం టుంది అత్తయ్య. వేగిరం వెళ్ళండి."

రాఘవులు పరుగు నడకలతో డాక్టరుదగ్గరికి పోయాడు.

"ఆవిడ సుఖంగా ప్రసవమయ్యిందిగాని, శరీరమంతా చల్ల బడింది డాక్టరుగారూ! మీరోసారి శ్రమతీసుకుని రావాలి..." అన్నాడు ప్రాధేయంగా.

"మంచి చిక్కేనయ్యా! పద" అంటూ బైలుదేరాడు. రాఘవులు బేగ్ పట్టుకుని అతనివెంట నడిచాడు.

డాక్టర్ని చూశాక, తులశమ్మకి ప్రాణం లేచివచ్చినట్టయ్యింది.

" దేవుడిలా వచ్చారు బాబూ " తృప్తిగా అంది.

డాక్టర్ శివరామ్ రోగిని పరీక్షించి, క్షణం ఆలోచించి, "ఇంజక్షను ఒకటివ్వాలి..." అన్నాడు.

"ఇవ్వండి డాక్టరుగారూ; డబ్బు ఎంతయినాసరే యిస్తాను. ఆవిడను కాపాడండి" ప్రాధేయపూర్వకంగా అన్నాడు రాఘవులు.

"ప్రస్తుతం నాదగ్గర ఆ యింజక్షను లేదు...చీటీ రాసి యిస్తాను. మా హాస్పిటల్‌కి వెళ్ళి కంపౌండర్ని అడిగి తీసుకు రావాలి."

రాఘవులు మొహం నిరాశతో పాలిపోయింది. తులశమ్మ మొహం వివర్ణమయ్యింది.

"వెళ్ళి తీసుకువచ్చేసరికి ఆలస్యమౌతుంది డాక్టరుగారూ: ప్రమాదమైన పరిస్థితి. ఇంకేదైనా సాధనం చేద్దురూ" గాభరాగా అంది తులశమ్మ.

"ప్రస్తుతం వినియోగించే యింజక్షను నాదగ్గర లేదమ్మా: ఏం చెయ్యను ? సాధారణంగా ప్రసవానంతరం వళ్లు చల్లబడకండా యిచ్చే మందులు, ఇంజక్షనులు వున్నాయి. కాని యివి పనిచెయ్యవు. నేను వూహించినదానికి విరుద్ధమైనదిది" అంటూ చీటీ వ్రాసి రాఘవులకి అందించాడు.

డాక్టరు చెప్పిందంతా నిజమే! అతనికి పాపం ఒకపక్క భయంగానే వుంది.

రాఘవులు బైటికి పరుగు లంకించుకున్నాడు.

పసిపాప కెవ్వుమంటోంది. తల్లి బాధతో నీరసంగా మూలుగుతోంది. తులశమ్మ, ఆమె కోడలు, యలసులు పెను తుపానులో వృక్షాల్లా వూగిసలాడుతున్నారు. శివరామ్ పసిపాప కేసి దీనంగా చూస్తున్నాడు.

తులశమ్మ, రోగిశరీరాన్ని మరోసారి తాకింది. స్తంభించి పోయింది.

"డాక్టరుబాబూ: వళ్లు మంచుముక్కలా అయింది." రుద్ధకంఠంతో అంది. ఆ రోగి ఎవరో ఏఁవిటో ఆమెకి తెలీదు. అయినా, మానవత ఆమెలోని భావాన్ని వెలికి తీసింది.

డాక్టర్ శివరామ్ రోగి దగ్గరకుపోయి పరీక్షించాడు. నాడి చాలా పేలవంగా కొట్టుకుంటోంది:

"కాస్త సరసావనూనె తీసుకురండి" అన్నాడు.

తులశమ్మ తెచ్చియిచ్చింది. అరచేతులకు రాయాలని ప్రయత్నిస్తుండగానే, ఆ తల్లి పిచ్చిగా ఓ చూపుచూచి, తల పక్కకు వాల్చేసింది. ఆమె కళ్లు శాశ్వతంగా మూతలు పడ్డాయి. ప్రక్కనేవున్న పసిపాప కెవ్వున అరిచింది. ఆ పసికూనకు తెలీదు తల్లి తనను విడిచిపోయిందని. అయినా, ఆ అనుబంధం అట్లాంటిది.

డాక్టరు కళ్లు చెమ్మగిల్లాయి. భారంగా లేచి దూరంలో వున్న కుర్చీలో కూలబడ్డాడు. తులశమ్మ హృదయవిదారకంగా అరిచింది.

అప్పుడే రాఘవులు వగర్చుకుంటూ లోపలికి వచ్చాడు.

"ఇదిగోండి డాక్టరుగారూ!" అంటూ ఆయాసంతో అందించబోయాడు. అతని దుస్తులు స్వేదంతో ముద్దయ్యాయి.

"బాబూ! మన ప్రయత్నం ఫలించలేదు. ఆమె ఈలోకం విడిచిపోయింది." స్వంత కూతుర్ని పోగొట్టుకున్నట్టే బావురు మంది తులశమ్మ.

రాఘవులుకి తలమీద పిడుగు పడినట్టయింది. ఓ సారి మంచం కేసి చూశాడు. పసిపాప తనకీ లోకంతో సంబంధం లేనట్టుగా ఆడుకుంటోంది. అతని కళ్లు నీళ్ళ పర్యంతమయ్యాయి. డాక్టర్ కేసి చూశాడు.

డాక్టరు అప్పుడే బేగ్ పట్టుకొని, నిర్జీవంగా కాసేపు నిలబడి పోబోయాడు.

"ఆగండి డాక్టర్!" గర్జించాడు రాఘవులు.

డాక్టరు ఆగిపోయాడు. రాఘవులు అతని దగ్గరగా పోయాడు.

"డాక్టర్! నిజంచెప్పండి... మీ దగ్గర నిజంగా ఆ యింజక్షను లేకపోయిందా? అది లేకపోయినా మరే సాధనమూ లేకపోయిందా? ఓ వ్యక్తి అంతిమ క్షణాల్లో వుంటే, దగ్గర

వుండికూడా ఆమెను రక్షించడానికి ప్రయత్నించలేదేం డాక్టర్? మీరు చదివిన చదువుకు ఇదేనా సార్థకత?" అన్నాడు బాధతో.

డాక్టర్ శివరామ్ నిశ్చేష్టుడయ్యాడు. రాఘవులు తనపై అటువంటి ఆరోపణ చేస్తాడని అతను అనుకోలేదు. అసలు, తన తప్పేముంది? ప్రతిరోగికీ అవసరమయ్యే యింజక్షన్లు, మందులు, డాక్టర్ల దగ్గర వుంటాయా యిరవైనాలుగ్గంటలూ! అన్నీ మెడిసిన్ బేగ్‌లో వుంచడం సాధ్యమా? అవన్నీ ఎందుకు ఆలోచించరు?

"చూడండి...మీరు నన్ను అపార్థం చేసుకొంటున్నారు. నేను డాక్టర్ని. డాక్టర్లకి ప్రజాసేవకంటే మరో పరమార్థం వుండదు. నేను కావాలనే మరే సాధనన్నా చెయ్యలేకపోయానని మీరు ఎలా అనుమానించారో అర్థంకాదు. ఒకవేళ నేను ధనాకాంక్షతోనే అలా ప్రవర్తించాననడానికీ ఆధారంలేదు. కావల్సినంత డబ్బు యిస్తామన్నారు. చూడండి, ఎంత కటిక హృదయుడైనా చావుబ్రతుకుల్లోవున్న మనిషిని కళ్ళారా చూస్తూ, అమానుషంగా ప్రవర్తించలేడు. నా మాట నమ్మండి. మరే దురుద్దేశమూ నాకులేదు..." అన్నాడు బాధగానే.

రాఘవులు డాక్టర్ మాటల్ని నమ్మకుండా వుండలేకపోయాడు గాని, అతని అనుమానం యింకా పూర్తిగా పటాపంచలవ్వలేదు.

"ఏ యింటి ఆడబడుచో, ఎవరి యిల్లాలో, ఏవూరో, ఎవరికీ తెలీదు డాక్టర్. ఆమెకి మరణం మాయింట్లో రాసిపెట్టి

వుంది గామోసు. ఆమెను మాత్రం కాపాడలేక పోయాను. కాపాడలేకపోయాను డాక్టర్" బావురుమన్నాడు రాఘవులు. అంతేగాని, డాక్టర్ని ఏవిధంగా నిందించాలో అర్థంకాలేదు.

డాక్టర్ శివరామ్ కళ్ళు చెమ్మగిల్లాయి. "నిజంగా మీా హృదయం నవనీతం. మీావంటివారే ప్రపంచంలో వున్న వాళ్లంతా అయితే, ద్వేషాలకీ, క్రోధాలకీ, అసూయలకూ తావుండదు. మీా యీా ప్రయత్నం ఫలింపజేయక పోవడం నిజంగా భగవంతుని సృష్టికే మచ్చవంటిది. కాని, ఏం చేస్తాం? మీారు మాత్రం దిగులుపడకండి. ప్రయత్నించడమే మన వంతు...ఫలితం దైవాధీనం ... యిదే మనకు చివరకు మిగిలే వేదాంతం..." అంటూ రాఘవులు భుజంతట్టి అనునయించ ప్రయత్నించాడు.

పసిపాప కెవ్వుమంది. డాక్టర్ ఓ సారి మంచం కేసి చూశాడు. తల్లి భౌతిక దేహమే తన ప్రక్కనుందన్న విషయం తెలియని అమాయక పసికందును చూసేసరికి అతనికి ఏడుపు వచ్చింది.

"చూడండి, మీారు మరోలా అనుకోపోతే ఒక్క విషయం చెప్పాలనివుంది" అన్నాడు రాఘవులుతో.

రాఘవులు ఆసక్తితో అతనివేపు చూశాడు.

"మీాకు అభ్యంతరం లేకపోతే, పసిపాపను నేను తీసుకు పోయి పెంచుకుంటాను..." అన్నాడు డాక్టర్.

పసిపాప విషయం రాగానే, రాఘవులుకి మరింత దుఃఖం ముంచుకొచ్చింది.

"లేదు డాక్టర్ : ఆ అవకాశం మీకివ్వలేను. తల్లిని ఏలాగూ రక్షించలేక పోయాను. కనీసం యీ పసిపిల్లనైనా పెంచుకొని, ఆ తల్లి ఆత్మకు శాంతిని చేకూర్చాలని నా అభిలాష. మాకూ సంతానంలేదు. ఈ పాప మా పాపే అనుకుంటాం. ఓ అనాధను ఆదుకున్నాం కదా అన్నతృప్తిఅయినా వుంటుంది" అన్నాడు.

డాక్టర్ యింకేమీ అనలేదు. అసలు అనడానికి యేముందని ?

"సరే – వస్తానండీ!" అంటూ భారంగా అడుగులు వేసుకుని నిష్క్రమించాడు.

రాఘవులు నిర్లిప్తంగా వున్నచోట నుంచుండిపోయాడు. ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. కళ్ళల్లోమాత్రం గిర్రున నీరు తిరుగుతూ చెక్కిళ్ళపై జాలువారుతూంది.

పసిపాప 'కేర్' మంది. రాఘవులు అప్రయత్నంగా, యాంత్రికంగా వెళ్లి పాపను చేతిలోకి తీసుకుని బావురుమన్నాడు.

"మీ అమ్మ నీకు దూరమయ్యింది పాపా! మీ అమ్మను రక్షించలేకపోయాను. తను చేయగలిగింది చేశానంటాడు డాక్టరు. అది ఎంతవరకూ నిజమో భగవంతుడికే తెలియాలి.

ఇంతకీ, నువ్వు దురదృష్టవంతురాలవు పాపా! గొప్ప దురదృష్ట వంతురాలవు. నువ్వు ఎవరవో ఏమిటో తెలుసుకోలేని దురదృష్ట వంతురాలవు. అయినా మా పాపవు..." బొంగురుపోతున్న స్వరంతో అంటూ, పాపను హృదయానికి హత్తుకున్నాడు. ఆ ఆ వేదనతో డాక్టరుమీద నమ్మకం యింకా కలగలేదంటే, అతని తప్పు కాదు...ఆ పరిస్థితి అటువంటిది.